JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | సోమవారం 11-05-2026
Medchal - Malkajgiri | Monday 11-05-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 344
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 344 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


# విజయ్ అనే నేను
## హోరెత్తిన స్టేడియం



- **తమిళనాడుకు ఇక ఆయనే కింగ్..**
- **కోటపై జెండా పాతిన దళ పతి..**
- **సీఎంగా విజయ్ కొత్త చరిత్ర!**

**జయభేరి, చెన్నై :**

తమిళనాడు రాజకీయాల్లో నవశకం.. జనసంద్రం సాక్షిగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన దళపతి విజయ్. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆ చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. చెన్నైలోని నెహ్రూ స్టేడియం సాక్షిగా, తమిళగ వెట్రి కళగం (TVK) అధినేత జోసెఫ్ విజయ్ మే 10న తమిళనాడు ముఖ్యమంత్రిగా సగర్వంగా ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ అర్లేకర్.. విజయ్ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. దశాబ్దాల తరబడి రాష్ట్ర రాజకీయాలను శాసించిన సంప్రదాయ పార్టీల ఆధిపత్యానికి ముగింపు పలుకుతూ, ఒక సామాన్య నటుడి నుంచి ప్రజా నాయకుడిగా విజయ్ సాగించిన ఈ ప్రస్థానం నేడు శిఖరాగ్రానికి చేరుకుంది. స్టేడియం లోపల, వెలుపల కిక్కిరిసిన లక్షలాది మంది అభిమానుల జయజయధ్వానాల మధ్య ఆయన ఈ అత్యున్నత బాధ్యతను స్వీకరించారు. ప్రమాణ స్వీకారానికి కుటుంబ సభ్యులు, రాహుల్ గాంధీ, త్రిష సహా చాలా మంది రాజకీయ, సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ అపూర్వ వేడుకకు విజయ్ ఎంతో నిరాడంబరంగా హాజరవ్వడం అందరినీ ఆశ్చర్యపరిచింది. సాధారణంగా సినిమాల్లో అత్యంత ఖరీదైన దుస్తుల్లో కనిపించే దళపతి, తన జీవితంలోనే అతిపెద్ద రోజున ఇలా నిరాడంబరంగా కనిపించడం ద్వారా తాను "ప్రజల మనిషిని" అనే బలమైన సందేశాన్ని పంపారు. గవర్నర్ ఆయనతో పదవీ ప్రమాణం చేయిస్తున్న సమయంలో విజయ్ గొంతులో వినిపించిన స్పష్టత, పట్టుదల ఆయన భవిష్యత్తు కార్యాచరణకు అద్దం పట్టాయి. స్టేడియం మొత్తం 'తలైవా' అన్న నినాదాలతో దద్దరిల్లిపోయింది. సినిమా రంగానికి చెందిన ప్రముఖులు, ముఖ్యంగా నటి త్రిష ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమె, తన అత్యంత ఆప్తమిత్రుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడుతున్న క్షణాలను కళ్లారా చూసి మురిసిపోయారు. విజయ్ వేదికపై ప్రమాణం చేస్తున్న సమయంలో త్రిష ఎంతో ఉద్వేగానికి లోనవ్వడం అక్కడి కెమెరాల కంటికి చిక్కింది. వీరిద్దరి మధ్య ఉన్న స్నేహం సినిమాల నుంచి రాజకీయాల వరకు కొనసాగడం పట్ల అభిమానులు సోషల్ మీడియాలో భారీగా పోస్టులు పెడుతున్నారు. వీరితో పాటు మరికొందరు సినీ ప్రముఖులు సైతం విఐపీ గ్యాలరీలో సందడి చేశారు. ప్రాంతీయ రాజకీయాల్లో మార్పును కోరుకుంటున్న తమిళ ప్రజలు ఈ వేడుకకు ఉప్పెనలా తరలివచ్చారు. అభిమానులు తరలిరావడంతో నెహ్రూ స్టేడియం పరిసరాల్లో ఇసుక వేస్తే రాలని రీతిలో జనసందోహం నెలకొంది. వేలాది మంది పోలీసులు భద్రతను పర్యవేక్షిస్తున్నప్పటికీ, జనాన్ని నియంత్రించడం కష్టతరంగా మారింది. జాతీయ నాయకులు సైతం ఈ వేడుకకు హాజరై విజయ్‌కు తమ మద్దతు ప్రకటించారు. సామాన్యుడికి అందుబాటులో ఉండే ప్రభుత్వం కావాలని ఆకాంక్షిస్తున్న యువతకు విజయ్ ఒక ఆశాకిరణంలా కనిపిస్తున్నారు.



# ఈసారి తెలంగాణలో బీజేపీ సర్కార్

ప్రధాని నరేంద్ర మోదీ ఈసారి తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది అన్నారు. ఒకప్పుడు ఏ సీట్లూ లేని రాష్ట్రాల్లో ఇప్పుడు బీజేపీ ప్రభుత్వాలు ఉన్నాయన్న మోదీ.. అదే విధంగా తెలంగాణలోనూ జరుగుతుందన్నారు. తెలంగాణలో ప్రజలు.. అవినీతి పాలనతో విసిగిపోయారన్న మోదీ.. ఈసారి బీజేపీ వైపు చూస్తారని అన్నారు.

- ప్రియమైన నా తెలంగాణ ప్రజలారా... మీ అందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు
- బెంగాల్ లో మొదటి సారి బీజేపీ సీఎం ప్రమాణ స్వీకారం
- స్వాతంత్రం వచ్చిన 50 ఏళ్ల తర్వాత అసోంలో బీజేపీ సర్కార్ హ్యాట్రిక్ కొట్టింది
- బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అవినీతి, కుటుంబ రాజకీయాలతో విసిగిపోయారు
- వికసిత్ తెలంగాణ లక్ష్యంగా కొత్త ఆలోచనలు, విజన్, కమిట్మెంట్ తో ముందుకు సాగుతుంది... ప్రధాని మోదీ

**జయభేరి, హైదరాబాద్ :**

తెలుగులో ప్రసంగం ప్రారంభించిన మోదీ.. "నా పెయింటింగ్ వేసుకొచ్చారు... మీరు అది నాకు పంపించండి. వెనక మీ అడ్రస్ రాయండి.. నేను మీకు ఉత్తరం రాస్తాను. ప్రియమైన నా తెలంగాణ ప్రజలారా... మీ అందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. నిన్న నేను బెంగాల్ లో ఉన్నాను.. అక్కడ మొదటి సారి బీజేపీ సీఎం ప్రమాణ స్వీకారం చేశారు. తొలి సారి భారీ మెజారిటీతో బీజేపీ సర్కారు ఏర్పడింది. ఈ చారిత్రాత్మక విజయ ఉత్సాహం తెలంగాణలోనూ కనిపిస్తోంది. ఇక్కడి బీజేపీ ప్రతీ కార్యకర్త ఉత్సాహంతో కనిపిస్తున్నారు. దేశంలోని ప్రతీ మూలలో బీజేపీపై ప్రజల విశ్వాసం పెరుగుతూ వస్తోంది. బీజేపీ గుడ్ గవర్నెన్స్ పై ఓటు వేస్తున్నారు. స్వాతంత్రం వచ్చిన 50 ఏళ్ల తర్వాత అసోంలో బీజేపీ సర్కార్ హ్యాట్రిక్ కొట్టింది. పుదుచ్చేరీలోనూ ఎన్డీయే సర్కారు ఏర్పడింది. తెలంగాణ ప్రజల భావన కూడా అర్థమవుతుంది. ఈ సారి తెలంగాణలోనూ బీజేపీ సర్కారు" అని మోదీ అన్నారు.
ప్రతీ సంవత్సరం ఏదో ఓ రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతాయి... ఒకరు గెలుస్తారు.. .ఒకరు ఓడిపోతారు... ఇది ప్రజాస్వామ్యంలో సర్వ సాధారణం. కానీ బెంగాల్ లో బీజేపీ గెలుపు దేశ వ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా ఉత్సవాలు జరుగుతున్నాయి. బెంగాల్ లో రాజకీయ పార్టీల గెలుపు ఓటములు కాదు. ఒక వైపు బెంగాల్ ప్రజల బానిస సంకెళ్ల నుంచి విముక్తి ఏర్పడింది. కాంగ్రెస్ పార్టీ

...మిగతాది 2 లో



## ప్రధాని మోదీపై పవన్ కల్యాణ్ భావోద్వేగ ట్వీట్..!

**జయభేరి, హైదరాబాద్ :**

జూబ్లీహిల్స్ నివాసానికి వచ్చి ఆరోగ్యం గురించి తెలుసుకున్న ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపిన పవన్ కల్యాణ్. భార్య అన్నా కొనిదెల, పిల్లలతో కలిసి ప్రధానికి స్వాగతం పలికిన పవన్. శస్త్రచికిత్స అనంతరం ఫోన్ చేసి పరామర్శించిన విషయాన్ని గుర్తుచేసుకున్న జనసేన అధినేత. "ప్రతి ఒక్కరినీ కుటుంబ సభ్యుల్లా చూసే నాయకుడు మోదీ" అంటూ ప్రశంసలు. దేశ బాధ్యతల మధ్య కూడా వ్యక్తిగతంగా పరామర్శించడం గొప్ప విషయమన్న పవన్ కల్యాణ్. ప్రధాని ప్రేమ, మార్గదర్శనం ఎప్పటికీ ప్రత్యేకమే అంటూ భావోద్వేగ వ్యాఖ్యలు..!

# మోదీజీ.. మీది పెద్ద మనస్సు

- మహానగరాలను అభివృద్ధి చేయాలి.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మీ సంకల్ప సాధనలో కేంద్ర ప్రభుత్వంతో కలిసి పయనించాలని తెలంగాణ ఆకాంక్షిస్తోంది

**జయభేరి, హైదరాబాద్ :**



వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడంలో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన పలు ప్రాజెక్టుల ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. వికసిత్ భారత్ లక్ష్యాలను సాధించడానికి దేశంలో గ్రోత్ ఇంజన్లుగా ఉన్న 6 ప్రధాన మహానగరాలకు సంబంధించిన జాతీయ ప్రాధాన్యత కలిగిన అన్ని ప్రాజెక్టులకు కేంద్రం నుంచి సత్వర అనుమతులు లభించేలా ప్రధానమంత్రి కార్యాలయంలో ప్రత్యేకంగా సింగిల్ విండో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణలో పలు అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల కోసం హైదరాబాద్ హెచ్ఐసీసీలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానమంత్రి మోదీ, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి లోక్‌సభ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను చేరుకోవడానికి తెలంగాణ కూడా తనవంతు భాగస్వామ్యం అందిస్తుందని హామీ ఇచ్చారు. అందుకు

...మిగతాది 2 లో



ప్రధాని నరేంద్ర మోడీ హైదరాబాద్ లోని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాసానికి వెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయన సతీమణి నారా భువనేశ్వరి, కుమారుడు, మంత్రి నారా లోకేష్, కోడలు నారా బ్రాహ్మణి, మనుమడు మాస్టర్ నారా దేవాన్ష్ ప్రధాని నరేంద్ర మోడీకి ఘన స్వాగతం పలికారు.

**జయభేరి, హైదరాబాద్**

మొదటిపేజీ తరువాయి

## మోదీజీ.. మీది పెద్ద మనసు

అనుగుణంగా రాష్ట్రంలో కూడా "తెలంగాణ రైజింగ్ 2047" లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు వెళుతోందని వివరించారు. "మీ సంకల్ప సాధనలో కేంద్ర ప్రభుత్వంతో కలిసి పయనించాలని తెలంగాణ ఆకాంక్షిస్తోంది. తెలంగాణకు సంబంధించి రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైల్, మూసీ నది పునరుజ్జీవం ప్రాజెక్టు, రేడియల్ రోడ్లు, హైదరాబాద్ - మచిలీపట్నం వరకు 12 వరుసల రహదారికి సంబంధించి కొన్ని ప్రతిపాదనలు మీ ముందు పెట్టాం" అని ప్రధానమంత్రికి గుర్తుచేశారు. "నా రాష్ట్రం, నా ప్రజల కోసం ప్రాజెక్టుల విషయంలో నేను మిమ్మల్ని, కేంద్ర మంత్రులను అనేకసార్లు కలిశాను. మా రాష్ట్రానికి సంబంధించిన కొన్ని ప్రాజెక్టులకు మీ అత్యవసర అనుమతులు, ఆమోదాలు అవసరం. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి కొన్ని ప్రతిపాదనలు మీ ముందు పెట్టాం. రెండు గంటల సమయం కేటాయించి వాటన్నింటినీ సానుకూలంగా పరిశీలించాలి" అని కోరారు. "దేశ ఆర్థిక వృద్ధి మహానగరాల నుంచే జరుగుతుంది. మన దేశంలో ఢిల్లీ, ముంబయ్, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ 6 మహానగరాలున్నాయి. ఈ దేశం ప్రపంచంలో అగ్రస్థానంలో నిలవాలంటే, యువతకు ఉద్యోగాలు రావాలంటే ఈ మహానగరాలను అభివృద్ధి చేయాలి. దేశం విషయంలో మేం మీతో కలిసి ఉన్నాం. రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడపాలని 4 కోట్ల తెలంగాణ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. వికసిత్ భారత్ 2047 నాటికి దేశం 30 ట్రిలియన్ డాలర్ల శక్తిగా ఎదగాలని నిర్దేశించారు. ఏ లక్ష్యాల కోసం మోదీ కలగంటున్నారో అందుకు అనుగుణంగా తెలంగాణ నుంచి దేశ జీడీపీకి 10 శాతం వాటా అందించాలని నిర్దేశించాం. తెలంగాణ రైజింగ్‌కు మీరు పూర్తి సహకారం అందిస్తారనే విశ్వాసం మాకుంది" అని ముఖ్యమంత్రి అన్నారు. "కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, సంజయ్ మంచి మిత్రులు. మీకు పెద్ద మనసు ఉందని చెబుతున్నారు. మోదీ మీకు పెద్ద మనసు ఉందని తెలంగాణకు తెలుసు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ పనులు, ప్రతిపాదనలు అన్నింటినీ ఆమోదిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు" అని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్‌లో నెలకొల్పిన PMMITRA పార్క్ (కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్) ను ముఖ్యమంత్రి, గవర్నర్ తో కలిసి ప్రధానమంత్రి ప్రారంభించారు. అలాగే , జహీరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్, మహబూబ్‌నగర్ నుంచి గూడబెల్లూరు జారి (నెంబర్ 167) కు, కాజీపేట - విజయవాడ మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. హైదరాబాద్ మల్కాపూర్‌లో ఇండియన్ ఆయిల్ గ్రీన్‌ఫీల్డ్ టెర్మినల్‌ను జాతికి అంకితమిచ్చారు.

## సీఎంగా బాధ్యతలు చేపట్టిన దళపతి విజయ్

తొలిరోజే 5 సంచలన నిర్ణయాలు..

జయభేరి, చెన్నై :




తమిళనాడు 21వ ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు చేపట్టి, తన మార్క్ పాలనను ప్రారంభించారు. గత ప్రభుత్వం చేసిన రూ. 10 లక్షల కోట్ల అప్పులపై శ్వేతపత్రం విడుదల చేస్తామని ప్రకటించి పొలిటికల్ హీట్ పెంచారు. ఉచిత విద్యుత్, మహిళా భద్రత వంటి 5 ప్రధాన హామీల అమలుతో ప్రజల్లోకి దూసుకుపోతున్నారు. దళపతి ఇన్నింగ్స్ ఇప్పుడు కోలీవుడ్‌లోనే కాదు, పాలిటిక్స్‌లోనూ హాట్ టాపిక్! తమిళనాడు రాజకీయ చరిత్రలో 1967 తర్వాత డీఎంకే, ఏఐఏడీఎంకే కాకుండా మూడో శక్తి అధికారంలోకి రావడం ఇదే తొలిసారి. 234 సీట్లున్న అసెంబ్లీలో 108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకే, మిత్రపక్షాల అండతో మ్యాజిక్ ఫిగర్‌ను దాటేసింది. రాహుల్ గాంధీ వంటి దిగ్గజాల సమక్షంలో విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఒక ఎత్తైతే, పగ్గాలు చేపట్టిన గంటలోనే ఆయన ప్రకటించిన 'టాప్5' నిర్ణయాలు ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. ఇది కేవలం అధికారం మార్పిడి మాత్రమే కాదు, దశాబ్దాల ద్రావిడ రాజకీయ పోకడలకు చెక్ పెడుతూ వచ్చిన పెను మార్పుగా విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యమంత్రిగా విజయ్ తన ప్రసంగంలో చాలా కీలకమైన పాయింట్ లేవనెత్తారు. "గత ప్రభుత్వం రాష్ట్రాన్ని 10 లక్షల కోట్ల అప్పుల్లో ముంచేసి, ఖజానాను ఖాళీ చేసి వెళ్ళిపోయింది" అని స్టాలిన్ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. ప్రజల సొమ్మును వృథా చేయకుండా, పారదర్శక పాలన అందిస్తానని ఆయన ఇచ్చిన హామీ సామాన్య ఓటర్లలో భరోసా నింపుతోంది.

**విజయ్ ప్రకటించిన 5 కీలక నిర్ణయాలు ఇవే..**

**200 యూనిట్ల ఉచిత విద్యుత్:** గృహ వినియోగదారులకు ఊరటనిస్తూ ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం చేశారు.

**సింగపెణ్ టాస్క్ ఫోర్స్:** మహిళా భద్రత కోసం ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేయడం ఆయన ప్రాధాన్యతలను తెలియజేస్తోంది.

**డ్రగ్స్ రహిత రాష్ట్రం:** యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్ ముఠాల అంతానికి యాంటీ డ్రగ్ ట్రాఫికింగ్ యూనిట్లను రంగంలోకి దించుతున్నారు.

**శ్వేతపత్రం:** గత డీఎంకే ప్రభుత్వ ఆర్థిక లావాదేవీలపై, అప్పులపై పూర్తిస్థాయి నివేదికను ప్రజల ముందు ఉంచబోతున్నారు.

**పారదర్శక పాలన:** అవినీతికి తావులేకుండా విద్య, వైద్యం, తాగునీరు వంటి కనీస వసతులపై దృష్టి సారించనున్నారు.

విజయ్ కేబినెట్‌లో తొమ్మిది మంది ప్రమాణస్వీకారం చేశారు. అందులో కీర్తన అనే యువతికి మంత్రి పదవి ఇవ్వడం ద్వారా తన టీమ్ ఎంత పకడ్బందీగా ఉందో ఆయన నిరూపించుకున్నారు. "విజయ్ కేవలం నటుడిగానే కాకుండా, ఒక పరిణతి చెందిన రాజకీయ నాయకుడిలా అడుగులు వేస్తున్నారు. మిత్ర పక్షాలను కలుపుకుపోవడమే కాకుండా, పాత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం ద్వారా తన పట్టును నిరూపించుకున్నారు." అని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా, అంతకుముందు నాటకీయ పరిణామాలు జరిగాయి. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమయ్యే మెజార్టీ లేదని విజయ్ ను గవర్నర్ మూడు సార్లు వెనక్కి పంపారు. చివరకు కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, వీసీకే పార్టీలు మద్దతు తెలపడంతో విజయ్ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు.

# 'సెంచరీ' దిశగా రూపాయి..

## ఆర్బీఐ దగ్గర బ్రహ్మాస్త్రం ఉందా? '2013 నాటి ప్లాన్' మళ్ళీ వస్తుందా?



అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల వల్ల భారత రూపాయి డాలర్‌తో పోలిస్తే 96 స్థాయికి పడిపోయింది. విదేశీ ఇన్వెస్టర్లు భారీగా పెట్టుబడులు వెనక్కి తీసుకోవడం కూడా దీనికి ప్రధాన కారణం. రూపాయి 100 స్థాయిని తాకే అవకాశం తక్కువని కొందరు నిపుణులు చెబుతున్నా, చమురు ధరలు 120 డాలర్లు దాటితే పరిస్థితి విషమించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

**100కు చేరువలో రూపాయి విలువ**

అంతర్జాతీయ మార్కెట్లో భారత రూపాయి పరిస్థితి ప్రస్తుతం 'కత్తి మీద సాము'లా మారింది. ఒకవైపు పశ్చిమాసియాలో ముదురుతున్న ఉద్రిక్తతలు, మరోవైపు ఆకాశాన్నంటుతున్న ముడి చమురు ధరలు మన కరెన్సీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తాజాగా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 96 స్థాయికి చేరువ కావడంతో, త్వరలోనే ఇది 100 మార్కును తాకుతుందా? అనే ఆందోళన అందరిలోనూ మొదలైంది. గడిచిన ఏడాది కాలంలోనే రూపాయి విలువ 10 శాతానికి పైగా పడిపోవడం ఆర్థిక వ్యవస్థపై పడుతున్న ఒత్తిడికి అద్దం పడుతోంది. ఎగుమతి, దిగుమతులపై ఆధారపడే వ్యాపారాలకే కాకుండా, సామాన్యుడి జేబుకు కూడా ఇది చిల్లు పెట్టే అంశమే. రూపాయి ఎందుకు ఇంతలా పడిపోతోంది? అనే ప్రశ్న వేసుకుంటే.. కేవలం యుద్ధ మేఘాలే కాదు, అంతకు మించిన కారణాలు కనిపిస్తున్నాయి. ముడి చమురు ధరలు పెరిగితే మనం ఎక్కువ డాలర్లు చెల్లించి కొనాల్సి ఉంటుంది. దీనివల్ల డాలర్‌కు డిమాండ్ పెరిగి మన రూపాయి బలహీనపడుతుంది. అయితే ఇక్కడ చమురు కంటే ప్రమాదకరమైనది 'విదేశీ ఇన్వెస్టర్ల నిష్క్రమణ'. ఈ ఏడాదిలోనే దాదాపు 2 లక్షల కోట్ల రూపాయలకు పైగా విదేశీ పెట్టుబడులు మన మార్కెట్ల నుంచి బయటకు వెళ్లిపోయాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) పుణ్యమా అని కొరియా, తైవాన్ వంటి దేశాల మార్కెట్లు ఆకర్షణీయంగా మారడంతో, ఇన్వెస్టర్లు ఇండియాను వదిలి అటువైపు మళ్లుతున్నారు.

**ఒకేసారి మూడు జరిగితేనే డేంజర్**

ముందుముందు పరిస్థితి ఎలా ఉండబోతోంది? అన్నదానిపై నిపుణులు ఆసక్తికర విశ్లేషణలు చేస్తున్నారు. కోటక్ సెక్యూరిటీస్ కరెన్సీ రీసెర్చ్ హెడ్ అనింద్య బెనర్జీ అభిప్రాయం ప్రకారం.. రూపాయి 100 స్థాయిని తాకడం అంత సులభమేమీ కాదు. "రూపాయి సెంచరీ కొట్టాలంటే మూడు కీలక పరిణామాలు జరగాలి. హార్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు పెరిగి సరఫరా ఆగాలి, బ్రెంట్ క్రూడ్ ధర 2008 నాటి గరిష్ట స్థాయి 150 డాలర్లకు చేరాలి మరియు ఎఫ్‌పీఐ (FPI)ల అమ్మకాలు ఇలాగే కొనసాగాలి." అని ఆయన విశ్లేషించారు. అంటే ఈ మూడు ఏకకాలంలో జరిగితేనే రూపాయికి గండం పొంచి ఉందని అర్థం. మరోవైపు ఆర్బీఐ (RBI) మౌనంగానే ఉన్నా, తెరవెనుక కరెన్సీని కాపాడే ప్రయత్నాలు చేస్తూనే ఉంది.

గతంలో 2013లో రూపాయి భారీగా పతనమైనప్పుడు ఎఫ్.సి.ఎన్.ఆర్ (FCNR) డిపాజిట్ల పథకాన్ని ప్రవేశపెట్టి విదేశీ కరెన్సీని ఆకర్షించారు. ఇప్పుడు కూడా అలాంటి అడుగు పడుతుందా? అనే చర్చ నడుస్తోంది. బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకనమిస్ట్ మదన్ సబ్నవిస్ దీనిపై స్పందిస్తూ.. "ప్రస్తుతానికి ఆర్బీఐ రూపాయి తన సహజమైన విలువను పొందేలా వదిలేసింది. కానీ విదేశీ మారక నిల్వలు 910 నెలల దిగుమతులకు సరిపడా లేనప్పుడు మాత్రమే ఇలాంటి అత్యవసర చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది." అని పేర్కొన్నారు. మొత్తంగా చూస్తే, రూపాయి భవిష్యత్తు క్రూడాయిల్ ధరలు 110 డాలర్ల లోపు ఉంటాయా లేదా అనే దానిపైనే ఆధారపడి ఉంది. ఎల్.కె.పి సెక్యూరిటీస్ అనలిస్ట్ జతీన్ త్రివేది మాటల్లో చెప్పాలంటే.. "ప్రస్తుత ఆర్థిక ఒత్తిళ్లు ఇలాగే కొనసాగితే 2026 చివరి నాటికి రూపాయి 100 స్థాయిని చూడవచ్చు. 95.50 96.50 స్థాయిలు రూపాయికి కీలకమైన సపోర్ట్ జోన్." ఒకవేళ ఇవి దాటితే మాత్రం మరిన్ని ఇబ్బందులు తప్పవు.




## ఈసారి తెలంగాణలో బీజేపీ సర్కార్

దేశంలో అవినీతిని, కుటుంబ రాజకీయాలను పెంచి పోషించింది. టీఎంసీ.. కాంగ్రెస్ నుంచి అవలక్షణాలన్నీ నేర్చుకుంది. టీఎంసీ తానీషా మోడల్ లో పేదలను పీడించింది... బెంగాల్ ప్రజలు ఈ మోడల్ ను తిరస్కరించారు. అందుకే దేశ వ్యాప్తంగా ఉత్సవాలు జరుగుతున్నాయి. దేశం గురించి ఆలోచించే వారిని ఎవరూ అడ్డుకోలేరు" అని ప్రధాని మోదీ అన్నారు. "ఎన్నికల ఫలితాలు భారతదేశంలోని ప్రతీ మూలలో వస్తున్న మార్పుకు నిదర్శనం. పదేళ్ల క్రితం అస్సాంలో ఒక్క ఎమ్మెల్యే కూడా లేడు... ఇప్పుడు మూడు సార్లు బీజేపీ సర్కార్ వచ్చింది... బెంగాల్ లో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉండేవారు... ఇప్పుడు ప్రభుత్వం ఏర్పడింది. బీజేపీ జెండా ఎత్తేవారు లేని చోట... బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి. తెలంగాణలో కూడా ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండేవారు. తెలంగాణ ప్రజలు, బీజేపీ కార్యకర్తలపై పూర్తి విశ్వాసం ఉంది. వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందన్న నమ్మకం ఉంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అవినీతి, కుంటుబ రాజకీయాలతో విసిగిపోయారు. రాష్ట్రాల అభివృద్ధితోనే దేశ అభివృద్ధి సాధ్యం. తెలంగాణ అభివృద్ధి పథంలో నడుస్తోంది. రాష్ట్ర అభివృద్ధిలో కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ సహకారం ఉంది. కొద్ది సేపటి క్రితం కోట్లాది రూపాయల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశాను. జహీరాబాద్ ఇండస్ట్రియల్ పార్క్ కు శంకుస్థాపన చేశాను. దీని ద్వారా వేలాది మందికి ఉపాధి లభిస్తుంది. వరంగల్ టెక్స్టైల్ పార్క్ ఏర్పాటు చేస్తున్నాం. తెలంగాణ పత్తి రైతులకు లబ్ధి చేకూరే విధంగా కొత్త విధానం రూపొందిస్తున్నాం. బీజేపీ అభివృద్ధి ఉపాధి కల్పించే విధంగా ఉంటుంది" అని ప్రధాని మోదీ అన్నారు. దేశంలో మూడు రాష్ట్రాల్లోనే కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ ఎక్కడున్నా ఒకటే నినాదం... అబద్ధం చెప్పు... మరచిపోవు. ఎన్నికల్లో గెలుపు కోసం ఆకాశంలో నక్షత్రాలు తెచ్చిస్తామని హామీ ఇస్తారు.. గెలిచాక మరచిపోతారు. తెలంగాణలో కూడా అదే జరుగుతోంది. కాంగ్రెస్ విధానం అభివృద్ధి కాదు.. దేశ విచ్ఛిన్నం చేసే విధానాలు. కాంగ్రెస్ లెఫ్ట్ పార్టీల కంటే కూడా భయంకరమైనవి. ముస్లింలీగ్ కంటే కూడా ఎక్కువ అయ్యారు. మిస్లిం లీగ్... మావో వాది కాంగ్రెస్ (ఎంఎంసీ) అయింది. మావో వాదుల ద్వారా ఎంత నష్టం జరిగిందో మీకు తెలుసు. మావోయిస్టులు చివరి శ్వాస తీసుకుంటున్నారు. మావోయిస్టులను, తీవ్రవాదులను రక్షించే పనిలో పడింది కాంగ్రెస్. మావోయిస్టులను, తీవ్రవాదులను రక్షించే పనిలో పడింది కాంగ్రెస్. తెలంగాణ పోలీసులు తమ శక్తితో కేంద్ర విధానాలతో కలిసి వచ్చి ఉంటే మావోయిస్టులు ఎప్పుడో తుదముట్టేవారు. సహకారం అందించపోవడం వల్లే మావోయిస్టుల నిర్మూలనకు సమయం పడింది. అందుకే తెలంగాణలో బీజేపీ సర్కారు ఏర్పాటు అవసరం ఏర్పడింది. వికసిత్ తెలంగాణ లక్ష్యంగా కొత్త ఆలోచనలు, విజన్, కమిట్మెంట్ తో ముందుకు సాగుతుంది" అని ప్రధాని మోదీ అన్నారు.

"కోవిడ్ తర్వాత ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైంది. ఇంధనం, ఎరువులకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. కోవిడ్ తర్వాత ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైంది. ఇంధనం, ఎరువులకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. 3000 వేల ఎరువులు 300 ఇచ్చాం. తాజా యుద్ధం భారత్ పై ప్రభావం పడింది. మన దగ్గర అవసరమైన పెట్రోలు, డిజిల్, గ్యాస్ లేదు. ఇతర దేశాల నుంచి తెప్పించాల్సి వస్తోంది. పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఎరువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ ప్రభావం నుంచి ప్రజలను బయటపడేసేందుకు ప్రభుత్వం రెండు నెలలుగా ప్రయత్నిస్తున్నాం. ఎంత ప్రయత్నించినా ఇబ్బందులు పెరుగుతూనే ఉన్నాయి. మనందరం కలిసి పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. దేశం కోసం చనిపోవడం దేశ భక్తి కాదు... దేశం కోసం బతకడం కూడా దేశభక్తి. ఈ సంకట సమయంలో మన కర్తవ్యం నిర్వర్తించడం కోసం సకల్పం తీసుకోవాలి. పెట్రోలు, డీజిల్ పొదుపుగా వాడాలి.. తగ్గించాలి. ఎక్కడైతే మెట్రో ఉందో... అక్కడ మెట్రో ఉపయోగించాలి. కారులో వెళ్లల్సి వస్తే కార్ పూలింగ్ చేయండి. ఎక్కడికైనా సామగ్రి పంపించాల్సి వస్తే రైల్వే గూడ్స్ ఉపయోగిచండి. ఎలక్ట్రిక్ రైలు కాబట్టి పెట్రోలు, డీజిల్ అవసరం పడదు. ఎలక్ట్రిక్ వాహనాలు ఎక్కువగా వాడండి. కరోనా సమయంలో వర్క్ ఫ్రం హోం, వీడియో కాన్ఫరెన్స్ లు వాడాం.. మనకు అలవాటు కూడా అయింది. అది మళ్లీ ప్రారంభించండి... మనకు చాలా ఉపయుక్తం. ఈ సంకట స్థితిని ఎదుర్కోవడం విదేశీ మారకద్రవ్యాన్ని కూడా పొదుపు చేసుకోవచ్చు. పెట్రోలు, డీజిలో ధరలు విపరీతంగా పెరిగాయి... దీని కోసం వెచ్చించే విదేశీ మారకద్రవ్యాన్ని వెచ్చించడం తగ్గించవచ్చు. విదేశీ యాత్రలు, విదేశీ యానాలు మధ్య తరగతి ప్రజల్లో పెరిగిపోయాయి. కనీసం ఒక సంవత్సరం విదేశాలకు వెళ్లడం మానేయండి. మన దేశం లో చాలా ప్రాంతాలున్నాయి... అక్కడ విహరించండి. విదేశీ కరెన్సీ కాపాడటం కోసం ఏమేం చేయాలో అది చేద్దాం. విదేశీ కరెన్సీ కాపాడటం కోసం ఏమేం చేయాలో అది చేద్దాం. బంగారం కొనుగోలులో కూడా విదేశీ కరెన్సీ అవసరం అవుతుంది. గతంలో యుద్ధాలు జరిగినప్పుడు బంగారం విరాళంగా ఇచ్చే వారు. ఇప్పుడు విరాళాలు అవసరం లేదు. ఏ ఫంక్షన్ అయినా బంగారం కొనొద్దు. గతంలో మనం రాగి ఎగుమతి చేసే వాళ్లం... ఇప్పుడున్న అవసరాల్లో రాగి కూడా దిగుమతి చేసుకుంటున్నాం. అందుకే నేడు కార్మిక సంఘాలను కూడా కోరుతున్నాం. భారత్ ను ఆత్మ నిర్భర్ చేసేందుకు అవసరమైన అన్ని చర్యలూ చేపట్టాలి. వంట నూనెలకు కూడా భారీ మొత్తంలో విదేశీ కరెన్సీ ఉపయోగించాలి. వంట నూనెలు వాడటం కూడా తగ్గించండి... ఇది కూడా దేశ సేవలో ఓ భాగం. వ్యవసాయ రంగంలో ఉపయోగించే రసాయనాల ద్వారా భూమాతకు చేటు చేస్తున్నాం. రసాయన ఎరువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించండి. నేచురల్ ఫార్మింగ్ వైపు అడుగులు వేయండి. మన పంటను, భూమాతను కూడా రక్షించుకోవచ్చు. సోలార్ పంపుల ఉపయోగించండి. వోకల్ ఫల్ లోకల్ నినాదం తో ముందుకు సాగండి. మేకిన్ ఇండియా ఉత్పత్తులు కొనండి. విదేశీ బ్రాండ్ లను పడేయమని అనడం లేదు.. కొత్తగా విదేశీ ఉత్పత్తులు కొనకండి. ఇంటిలో ఉపయోగించే వస్తువుల లిస్ట్ తయారు చేయండి... ఎంత సామగ్రి విదేశీ వస్తువులు మన ఇంట్లో చొరబడ్డాయో చూడండి. మనం విదేశీ నుంచి స్వదేశీకి మారాల్సిన అవసరం ఉంది. ఇది బీజేపీ ఇష్యూ మాత్రమే కాదు.. దేశం ఇష్యూ. దేశ హితం కోసం ముందుకు రావాలని నేను మీడియాను కూడా కోరుతున్నాం. ఇలా చేస్తే ఎలాంటి విపత్కర పరిస్థితులైన సమర్ధవంతంగా ఎదుర్కోగలం" అని ప్రధాని మోదీ ఇవాళ పరేడ్ గ్రౌండ్ బహిరంగ సభలో అన్నారు.

## పెట్రోల్, బంగారంపై ప్రధాని మోదీ సంచలన వ్యాఖ్యలు..

దేశ ప్రజలు ఏడాది పాటు బంగారం కొనొద్దని, సంస్థలు వర్క్ ఫ్రమ్ హోమ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. పెట్రోల్ వాడకం తగ్గించేందుకు ప్రజా రవాణా వాడాలని, విదేశీ బ్రాండ్లను బహిష్కరించి ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని ఆయన సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేడు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో దేశ ప్రజలకు ఒక కీలక సందేశం ఇచ్చారు. పశ్చిమాసియా లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభానికి దారి తీస్తున్న నేపథ్యంలో మోదీ పలు సూచనలు చేశారు. భారత్ తన అవసరాల కోసం అత్యధికంగా ముడి చమురు దిగుమతులపైనే ఆధారపడుతోందని గుర్తు చేస్తూ, ఇంధనాన్ని పొదుపుగా వాడుకోవాలని పిలుపునిచ్చారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ లాంటి ఇంధనాలను అవసరమైనంత వరకే ఉపయోగించడం ద్వారా విలువైన విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయవచ్చని, తద్వారా అంతర్జాతీయ యుద్ధ సంక్షోభాల ప్రభావాన్ని కొంతమేర ఎదుర్కోవచ్చని ఆయన స్పష్టం చేశారు. అలాగే, దేశ ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కనీసం ఒక ఏడాది పాటు ప్రజలు బంగారం కొనుగోలు చేయవద్దని ఆయన సూచించారు.

**వర్క్ ఫ్రమ్ హోమ్‌కు ప్రాధాన్యత..**

ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పలు కీలక సూచనలు చేశారు. ఇంధన పొదుపు, ఆర్థిక క్రమశిక్షణ లక్ష్యంగా దైనందిన జీవితంలో కొన్ని మార్పులు చేసుకోవాలని ఆయన కోరారు. ఐటీ, ఇతర రంగాల సంస్థలు తమ ఉద్యోగులకు వీలైనంత వరకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

**ఏడాదిపాటు బంగారం కొనొద్దు..**

అలాగే, దేశ ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కనీసం ఒక ఏడాది పాటు ప్రజలు బంగారం కొనుగోలు చేయవద్దని ఆయన స్పష్టం చేశారు. విదేశీ బ్రాండ్ల వస్తువుల వాడకాన్ని పూర్తిగా నిలిపివేయాలని, కేవలం దేశీయ ఉత్పత్తులనే ప్రోత్సహించాలని ప్రధాన మంత్రి దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.

**ప్రజా రవాణాకే పెద్దపీట**

పెట్రోల్, డీజిల్ వాడకాన్ని భారీగా తగ్గించేందుకు ప్రజలు వ్యక్తిగత కార్ల వినియోగాన్ని వీలైనంత వరకు మానుకోవాలని మోదీ సూచించారు. ప్రయాణాలకు మెట్రో రైళ్లను వినియోగించుకోవాలని కోరారు. వస్తువులు, పార్శిళ్ల రవాణా కోసం కూడా రోడ్డు మార్గం కాకుండా రైళ్లనే ఉపయోగించాలని స్పష్టం చేశారు. కేవలం ఇంధనాలే కాకుండా ఇళ్లలో వంట నూనెల వినియోగాన్ని కూడా సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు**

వ్యవసాయ రంగంలో రైతులు కీలక మార్పులు తీసుకురావాలని ప్రధాని ఆకాంక్షించారు. పంటలకు రసాయన ఎరువుల వాడకాన్ని సగానికి తగ్గించాలని, రైతులంతా క్రమంగా ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని సూచించారు. మన దేశంలో తయారైన వస్తువులను వాడటం ద్వారా మాత్రమే దేశం ఆర్థికంగా మరింత బలోపేతం అవుతుందని ప్రధాని ఈ సందర్భంగా నొక్కి చెప్పారు.

**తెలంగాణకు భారీ నజరానా**

మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి తెలంగాణకు వచ్చిన మోదీ, రూ.9,400 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, కాజీపేటవిజయవాడ మల్టీ ట్రాకింగ్ రైల్వే లైన్, వరంగల్‌లో పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్క్ వంటి కీలక ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పెరిగి, ఆర్థికాభివృద్ధి వేగవంతం అవుతుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. వేదికపై సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలోనే ఆయన ప్రతిపక్షాల పై విమర్శలు గుప్పించారు.

# చీకట్లోనే రాష్ట్రపతి భవన్ పరిసరాలు

- యాదగిరిపల్లి నుంచి రాజాపేట వెళ్లే రోడ్డు చీకటి మాయం
- అంధకారంలో రాష్ట్రపతి భవన్ నుంచి దేవస్థానం వెళ్లే రోడ్డూ రాత్రుల్లో అటువైపు వెళ్లాలంటే భయపడుతున్న ప్రయాణికులు
- అదే దారిలో పాలిటెక్నిక్ కాలేజీ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు,ప్రయాణికులు డిమాండ్



**జయభేరి, యాదగిరిగుట్ట, మే 10 :**

రాష్ట్రపతి భవన్.... శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి దర్శనార్థం వచ్చే వీఐపీల కోసం ప్రత్యేకంగా కట్టించిన భవనం. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి దర్శనానికి వచ్చే సీఎం, మంత్రులు,పెద్ద వ్యాపారులతో పాటు వీఐపీలు ఉండే రాష్ట్రపతి భవన్ పరిసరాలు మాత్రం చీకట్లో మగ్గుతున్నాయి. రాత్రి 7గంటలకు అయితే చాలు చీకటిని అలుముకొని ప్రయాణికులు,భక్తులను భయపెడుతున్నాయి. కనీసం అక్కడక్కడైనా వీధి దీపాలు లేకపోవడంతో చిమ్మచీకటిలోనే ప్రయాణికులు,భక్తులు వెళ్లాల్సి వస్తోంది. యాదగిరిపల్లి నుంచి రాజాపేట వెళ్లే ప్రధాన రహదారి అయినా అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రాత్రిళ్లు ప్రయాణికులు అటువైపు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితిలో ఆ రోడ్డు ఉందంటే అతిశయోక్తి కాదు. యాదగిరిపల్లి నుంచి రాజాపేట వెళ్లే మార్గంలోనే పాలిటెక్నిక్ కళాశాల,ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు అంజనాపురం కాలనీ ఉండడంతో చీకట్లోనే ప్రయాణాలు కొనసాగించాల్సిన పరిస్థితి దాపురించింది. రాష్ట్రపతి భవన్ చౌరస్తా నుంచి దేవస్థానానికి వెళ్లే రోడ్డులో సైతం విద్యుత్ దీపాలు ఉన్నా అవి వెలగకపోవడం అధికారుల పనితీరుకు నిదర్శనంగా మారింది. రాజాపేట,వంగపల్లి వైపు వెళ్లే ప్రయాణికులు రాష్ట్రపతి భవన్ చౌరస్తాలో బస్సులు, ఆటోలో కోసం ఎదురుచూస్తుంటారు. కానీ రాత్రి సమయాల్లో వీధి దీపాలు లేక భయంతో ప్రయాణికులు యాదగిరిపల్లి వరకు లేదా ఆర్టీసీ బస్టాండ్ వరకు నడుచుకుంటూ వెళ్తున్నట్టు పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఈ మధ్య కాలంలో లారీలు అధికంగా వస్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు మేల్కొని యాదగిరిపల్లి నుంచి రాష్ట్రపతి భవన్ వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని,రాష్ట్రపతి భవన్ సర్కిల్ నుంచి దేవస్థానానికి వెళ్లే రోడ్డులో వీధి దీపాలకు మరమ్మతులు చేసి వెలిగేలా చేయాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

### పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలి..

యాదగిరిపల్లి నుంచి అంజనాపురం కాలనీ, రాష్ట్రపతి భవన్ చౌరస్తాలో పోలీసు పెట్రోలింగ్ వాహనాలు ఎక్కువగా తిరిగేలా చూడాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. చీకటితో పాటు చుట్టూ నిర్మానుష్య ప్రాంతం కావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని, పాలిటెక్నిక్ కాలేజీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండడంతో అర్ధరాత్రి సమయంలో రాష్ట్రపతి భవన్ చౌరస్తాలో పెట్రోలింగ్ వాహనాలతో మానిటరింగ్ చేయాలని కోరుతున్నారు.




## గుర్తు తెలియని బాలుడు లభ్యం

**జయభేరి, హయత్‌నగర్ :**

హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మల్లేష్ (12) అనే బాలుడు 10.05.2026 తేదీన ఉదయం సుమారు 09:00 గంటల సమయంలో సంచరిస్తూ కనిపించాడు. బాలుడిని విచారించగా తన ఇంటి చిరునామా గాని, తల్లిదండ్రుల వివరాలు గాని చెప్పలేకపోతున్నాడు. బాలుడి భద్రత, సంరక్షణ నిమిత్తం అతడిని సైదాబాద్, హైదరాబాద్‌లోని బాలుర బాలల గృహానికి తరలించడమైనది. ఈ బాలుడి గురించి లేదా అతని కుటుంబ సభ్యుల గురించి ఎవరికైనా సమాచారం తెలిసి ఉంటే వెంటనే హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించగలరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: హయత్‌నగర్ పోలీస్ స్టేషన్, ఫోన్ నెంబర్: 8712662640.

## రోడ్డు దాటుతుండగా ప్రమాదం

**జయభేరి, హయత్‌నగర్ :**

దండుమైలారం గ్రామానికి చెందిన, జంగయ్య భార్య బీర్ల లక్ష్మమ్మ (80) (కుల: బీసీబి కురుమ) అనే మహిళ, తోరూరు గ్రామంలోని మల్లారెడ్డి రంగారెడ్డి ఇంటి సమీపంలో రోడ్డు దాటుతుండగా, మునగానూర్ నుండి తోరూరు వైపు వస్తున్న TS07GF0071 నంబరు గల (పల్సర్ 150) బైక్ ఢీకొట్టింది. ఈ ధాటికి ఆమె రోడ్డుపై పడిపోయి అక్కడికక్కడే మరణించారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న పవన్‌కు కూడా గాయాలయ్యాయి.

## విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం

**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో భాగంగా దేవరకొండ పట్టణంలోనీ పిఎంశ్రీ జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాల లో ప్రత్యేక వేసవి శిబిరాన్ని శ్రీయుత ఎం మాత్రూ నాయక్ మండల విద్యాధికారి పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చేరిపల్లి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలియజేసినారు. 15 రోజులపాటు ఈ శిబిరం కొనసాగుతుందనీ, ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు శిక్షణా తరగతులు నిర్వహించబడతాయనీ తెలిపారు. 5 వ తరగతి పూర్తి చేసి ప్రస్తుతం 6 నుండి 9వ తరగతి లో చేరబోయే విద్యార్థులందరూ.. ఈ శిక్షణకు అర్హులే అని తెలిపారు. విద్యార్థులు కేవలం చదు వే కాకుండా ఇతర సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవడమే లక్ష్యంగా చిత్రలేఖనం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, సంగీతం, నృత్యం , విద్యార్థులకు ఉల్లాసాన్నిచ్చే ఆటలు ,పాటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, మానసిక ప్రశాంతత కోసం యోగా లాంటి వివిధ కార్యక్రమాలకు ఈ క్యాంపులో శిక్షణ ఇవ్వనున్నారని తెలిపారు. ఈ శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు ప్రతిరోజు పౌష్టికాహారం (స్నాక్స్) ప్రభుత్వము అందజేస్తుంది. కావున విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఈ సమ్మర్ క్యాంపును విజయవంతం చేయగలరని కోరారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జీ పరమేశ్వర్ రెడ్డి కృషి ఫలితం — ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్)




**జయభేరి, ఉప్పల్ :**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగానికి కొత్త ఊపిరి లభించిందని కాంగ్రెస్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే సంకల్పంతో కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (CURE) పరిధిలో రూ.1011 కోట్ల భారీ నిధులను మంజూరు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి గారి నిరంతర కృషి, ప్రజా ప్రయోజన దృక్పథం వల్లే ఉప్పల్ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి మరియు అప్‌గ్రేడేషన్‌కు భారీగా నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు.

**ఉప్పల్ నియోజకవర్గంలో మంజూరైన నిధులు :**

ఉప్పల్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల - రూ.18.00 కోట్లు, అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాల - రూ.12.20 కోట్లు, కుషాయిగూడ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల - రూ.19.10 కోట్లు, సుభాష్ నగర్ ప్రాథమిక పాఠశాల - రూ.12.20 కోట్లు, ఫాతుల్లగూడ ప్రాథమిక పాఠశాల - రూ.26.70 కోట్లు. ఈ నిధులతో పాఠశాలల అప్‌గ్రేడేషన్, ఆధునిక సదుపాయాల కల్పన, అదనపు తరగతి గదుల నిర్మాణం, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం ఏర్పాటు చేయబడనుందని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్య అందించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ విద్యారంగం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పరమేశ్వర్ రెడ్డికి ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# చెరువు బతుకుదెరువు

- లక్ష్మాపూర్ చెరువులో పూడిక తీత పనులు చేపట్టిన ఇరిగేషన్ అధికారులు




**జయభేరి, శామీర్ పేట్, మే 9:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులు శర వేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం లక్ష్మాపూర్ లోని పెద్ద చెరువులో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన జంగిల్ క్లియరెన్స్, మరియు చెరువు పూడిక తీత పనులు చేపట్టగా ఈ పనులను మున్సిపల్ చైర్మన్ జాం రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టిన చైర్మన్, అనంతరం చెరువు పరిసర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సలహాలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ జాం రవి మాట్లాడుతూ చెరువుల పునరుద్ధరణతో భూగర్భ జలాలు పెరగడమే కాకుండా రైతులకు కూడా ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. చెరువు పూడిక తీతలో బయటకు వచ్చే మట్టిని రైతులు తమ పంట పొలాలకు తీసుకెళ్లి వినియోగించుకోవాలని సూచించారు. ఈ మట్టిలో సహజ భూసారం అధికంగా ఉండటంతో రసాయన ఎరువుల వినియోగం తగ్గి, పంటల దిగుబడి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. వ్యవసాయ ఖర్చులు తగ్గి రైతులకు ఆర్థికంగా లాభం చేకూరుతుందని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా చెరువులు శుభ్రపడి వర్షాకాలంలో ఎక్కువ నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుందని, దీంతో భవిష్యత్తులో సాగునీటి సమస్యలు తగ్గే అవకాశం ఉందన్నారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న పనులకు ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు. అదేవిధంగా చెరువు పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన పొదలు, అడవి మొక్కలు తొలగించడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని అధికారులు తెలిపారు. చెరువుల పునరుద్ధరణతో పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు అందుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ డీఈ జైపాల్, ఏఈ ప్రశాంత్, కౌన్సిలర్లు సరిత, శ్రీవాణి, నాయకులు వైద్యనాథ్, ఆంజనేయులు, శ్రీనివాస్, రవి, వర్క్ ఇన్స్పెక్టర్ వాసుదేవ్, స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాతృ దినోత్సవ వేడుకలు



**జయభేరి, దేవరకొండ :**

స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మహాలక్ష్మి మహిళా వృద్ధాశ్రమంలో అధ్యక్షుడు NVT, కొండ్ర శ్రీశైలం యాదవ్ సింగిల్ విండో చైర్మన్, లీగల్ అడ్వైజర్ ఉమా మహేష్ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసినారు.ఫ్రూట్స్ పంచి అన్న ప్రసాదం కార్యక్రమం నిర్వహించినారు. అధ్యక్షుడు మాట్లాడుతూ భగవంతుని మరో స్వరూపం అమ్మ అని, సృష్టిలో అమ్మను మించిన దైవం లేదని, తల్లి ప్రేమ వెలకట్టలేనిదని మదర్స్ డే మాతృ దినోత్సవం అనేది తల్లుల అంతులేని ప్రేమ, త్యాగాలు మరియు కుటుంబం కోసం వారు చేసే సేవలను గౌరవించడానికి జరుపుకునే ప్రత్యేకమైన రోజు అని, భారతదేశం అమెరికాతో సహా అనేక దేశాలలో ప్రతి సంవత్సరం మే నెల రెండవ ఆదివారం నాడు దీనిని జరుపుకుంటారు అని, ఈ ఆధునిక వేడుక అమెరికాలో అన్నా జార్విస్ అనే మహిళ తన తల్లి జ్ఞాపకార్థం ప్రారంభించారు. అమ్మ ప్రేమకు చిహ్నంగా నిలిచే ఈ రోజు, ఆమెకు కృతజ్ఞతలు తెలియజేయడానికి ఆమె త్యాగాలను స్మరించుకోవడానికి ఒక గొప్ప అవకాశం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, రాపోలు నిరంజన్, YS కరుణాకర్, ATO ప్రసన్న కుమార్, సుజిత్, సంధ్యారెడ్డి, గాజుల యాదమ్మ, హేమలత, జయలక్ష్మి ,జానకి ,స్టీవెన్, డేవిడ్ ఫిలిప్స్, జమీర్, కరాటే మాస్టర్ గోపి, శ్రీకాంత్, మహేష్ ,మురళి, కిషోర్, జామ్ శేఖర్ రాజ్ కుమార్ మల్లేష్, క్రీడాకారు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా డాక్టర్ లక్ష్మణ్ హాస్పిటల్ ప్రారంభోత్సవం

- ముఖ్య అతిథులుగా వజ్రేష్ యాదవ్ సింగిరెడ్డి పద్మారెడ్డి

**జయభేరి, మేడిపల్లి :**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో డాక్టర్ లక్ష్మణ్ అస్తమ & చెస్ట్ ఆస్పత్రి ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి, మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, జనార్ధన్, ప్రమోద్ కుమార్ ప్రశాంత్, బొమ్మక్ రమేష్, నర్సింగ్ రావు శెట్టి తదితరులు పాల్గొని హాస్పిటల్ ప్రారంభించారు. బోడుప్పల్ , మేడిపల్లి పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ హాస్పిటల్ యాజమాన్యానికి వైద్య సిబ్బందికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువు రాజకీయ ఇద్దరు మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.. అనంతరం హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వి లక్ష్మణ్ బాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ నేతలు, మాజీ కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం



**జయభేరి, ఉప్పల్ :**

చిలుక నగర్ డివిజన్ పరిధిలోని కల్యాణ పూరి కమ్యూనిటీ హాల్ లో BRS పార్టీ నాయకులు నేర్థం భాస్కర్ నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని తెలిపారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో నిపుణులైన వైద్యులు పాల్గొని, ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి మందులు మరియు కళ్లజోళ్లు ఉచితంగా అందజేశారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని, ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలకు ఆరోగ్య సేవలు చేరువవుతాయని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరిన్ని వైద్య శిబిరాలను నిర్వహించేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది, సేవా సంస్థ ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఉప్పల్ ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం



**జయభేరి, ఉప్పల్ :**

హెచ్ఎంటి నగర్ డివిజన్ శ్రీ రాఘవేంద్ర నగర్ కాలనీలో డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి అలాగే సిమెంటు రోడ్ల కొరకు నిధులు మంజూరై పనులు ప్రారంభించడానికి అధికారులు కాంట్రాక్టర్ రెడీగా ఉన్నారు. కానీ మంచి నీటి పైప్లైన్లు సుమారు 8 అడుగుల కింద ఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తక్షణమే మంచినీటి పైప్లైన్లు కొత్తవి వేయించాలని ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసిన శ్రీ రాఘవేంద్ర నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు. సమస్య విన్న వెంటనే ఎమ్మెల్యే జలమండలి జనరల్ మేనేజర్ సంతోష్ తో మాట్లాడి తక్షణమే ప్రతిపాదనలు తయారు చేసి ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మక్తల శేఖర్ గౌడ్ సంఘం యాదగిరి శ్రీనివాస్ రెడ్డి వెంకట్ రెడ్డి లింగం యాదవ్ ప్రవీణ్ సాయి జెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా హెల్త్ క్యాంప్



**జయభేరి, ఉప్పల్ :**

శ్రీరామ నగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం అత్యంత ప్రాధాన్యమైనదని, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కాలనీల్లో నివసించే ప్రజలు సులభంగా వైద్య సేవలు పొందేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని సూచించారు. ఈ హెల్త్ క్యాంప్‌లో రక్తపోటు (BP), ర్యాండమ్ బ్లడ్ షుగర్ (GRBS), ఎత్తు & బరువు, ఉష్ణోగ్రత పరీక్షలు, ECG, డెంటల్ చెకప్, కంటి పరీక్షలు, జనరల్ ఫిజీషియన్ సేవలు అందించబడ్డాయి. వైద్య నిపుణులు ప్రజలకు ఆరోగ్య సూచనలు కూడా అందించారు. కార్యక్రమంలో కాలనీ నివాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచిత వైద్య సేవలను పొందారు. నిర్వాహకులు మరియు వైద్య బృందానికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు, కాలనీ నివాసులు పాల్గొన్నారు.



## హాకీ శిక్షణా శిబిరంలో కిట్స్ పంపిణీ

- సోదా రామకృష్ణ, హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు

**జయభేరి, పరకాల, మే 10:**

ఆదివారం పరకాల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ లో ధ్యాన్ చంద్ హాకీ క్లబ్ పరకాల వారి ఆధ్వర్యంలో మే 1వ తేదీన నుండి నెలరోజులపాటు అందించనున్న ఉచిత హాకీ వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేయగా శిక్షణ శిబిరాన్ని సందర్శించి వారికి హాకీ స్టిక్స్, క్రీడా సామాగ్రి ని పంపిణీ చేసిన హనుమకొండ జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షులు సోదా రామకృష్ణ, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో హాకీ స్టిక్స్, క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నూతన పట్టణ అధ్యక్షులు ఒంటేరు శ్రవణ్ కుమార్, అధికార ప్రతినిధి చందుపట్ల రాఘవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్ రిజ్వీ, మున్సిపల్ కౌన్సిలర్స్ అల్లే దశరథం, బండి శ్రీధర్, గూడెల్లి సదన్ కుమార్, సూదమల్ల రమేష్, పసుల రమేష్, పోరండ్ల వేణు, పాలకుర్తి శ్రీనివాస్, కొయ్యడ శ్రీనివాస్, నాయకులు బొచ్చు అనంత్, బొచ్చు జెమిని, చెరుపెల్లి మొగిలి హాకీ క్రీడాకారులు గోనెల నరసింహ, అల్లం శ్రీనివాస్, నాగార్జున, సూదమల్ల ప్రశాంత్, కాసర్ల రత్నాకర్, బండి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి




**జయభేరి, తుర్కపల్లి, మే 10 :**

తుర్కపల్లి మండలం రాంపూర్ తండాలో గల మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఆరవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి విద్యార్థులకు వేసవి శిబిరాన్ని ఈనెల 11 నుండి 25 వరకు ఉదయం 8:00 గంటలు నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ అంబటి శోభారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వేసవిలో విద్యార్థులకు సంగీతం, నాట్యం, చిత్రలేఖనం, కథలు చెప్పడం లాంటి అంశాలలో విద్యార్థులకు నైపుణ్యం పెంపొందించే లక్ష్యంతో ప్రభుత్వం వేసవి శిబిరాన్ని ఏర్పాటు చేసిందని అన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రజానాట్యమండలి మూడవ మహాసభను జయప్రదం చేయాలి



**జయభేరి, తుర్కపల్లి, మే 10 :**

తెలంగాణ ప్రజా నాట్యమండలి మూడవ మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి సిల్వేరు దుర్గయ్య అన్నారు. ఆదివారం తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామంలో కళాకారులను నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీని త్యాగ జాను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిల్వేరు దుర్గయ్య మాట్లాడుతూ అర్హులైన కళాకారులకి పెన్షన్ ఇవ్వాలని ఐడెంటి కార్డులను ఇవ్వాలని కళాకారులకు హాస్పటల్లో ఉచిత వైద్యం ఇవ్వాలని అన్నారు. తెలంగాణ ప్రజానాట్యమండలి ఈనెల 20వ తేదీన ఆలేరులో జరిగే మూడో మహాసభ జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్యమండలి కళాకారుల జిల్లా ఉపాధ్యక్షురాలు ఇంజా హేమలత శ్రీనివాస్, శ్యాగ మల్లేశం, గడిపే సత్యనారాయణ, శ్యాగ బాలరాజు, లింగయ్య, శ్యామల, గడిపే వంశీ, గడిపే కృష్ణ, గడిపే పోచమ్మ, పాల్గొన్నారు.

## చలో పరేడ్ గ్రౌండ్స్

- మోదీ సభకు బయలుదేరిన బిజెపి నాయకులు.



**జయభేరి, పరకాల, మే 10:**

భారత ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు బిజెపి పరకాల పట్టణ శాఖ అధ్యక్షులు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో బయలుదేరిన బీజేపీ నాయకులు. ఈ సందర్భంగా పట్టణ శాఖ కార్యాలయం వద్ద, పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్ సభకు వెళ్లే బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి, తెలంగాణ ప్రగతే లక్ష్యంగా భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు సభకు తరలివెళ్లారు. "సబ్కా సాథ్ - సబ్కా వికాస్"అనే నినాదంతో బీజేపీ శ్రేణులు ఉత్సాహంగా ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ కౌన్సిలర్లు బెజ్జంకి పూర్ణ చారి, కుక్కల విజయకుమార్, ఆకుల లావణ్య శ్రీధర్, చందుపట్ల రాజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంఘ పురుషోత్తం, ఉపాధ్యక్షులు మిడిదొడ్డి నరేష్, ముత్యాల కోమలదేవేందర్, పావుశెట్టి సునీత, మెంతుల స్వప్నసురేష్, ఉడుత చిరంజీవి, పిట్ట కిషోర్, కానుగుల గోపీనాథ్, తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భక్తులతో నిండిన యాదగిరికొండ

- శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి నిత్య రాబడి రూ.51.80 లక్షలు

**జయభేరి, యాదగిరిగుట్ట, మే10 :1**




యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి దర్శనానికి భారీగా భక్తులు తరలిరావడంతో యాదగిరి కొండ నిండిపోయింది. వేసవి సెలవులు కావడంతో స్వామి,అమ్మవార్ల దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. ఎండలను సైతం లెక్క చేయకుండా శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుండి తరలివచ్చిన భక్తులతో యాదగిరిగుట్ట కిటకిటలాడింది. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి కొండపైన, కొండ కింద పలు ప్రాంతాల్లో ఎటు చూసినా భక్తుల రద్దీ కనిపించింది. స్వామి వారి మెట్ల మార్గం, ఘాట్ రోడ్లలో భక్తులు సందడి చేశారు. స్వామి వారి దర్శన క్యూలైన్లు, ప్రసాద విక్రయ కేంద్రాలు, గదుల విచారణ కార్యాలయం,టికెట్ల విక్రయ కేంద్రాలు,పార్కింగ్,బస్టాండ్, పుష్కరిణి,తలనీలాలు సమర్పించే కేంద్రం, శ్రీసత్యనారాయణ వ్రత మండపంతో పాటు పరిసర ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. అశేషంగా తరలివచ్చిన భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారి ఉచిత దర్శనానికి 5 గంటలకు, సర్వ దర్శనానికి 3 గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

**కొనసాగుతున్న నిత్యపూజలు..**

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలతో పాటు పలు సేవల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**యాదగిరీశుడి నిత్యరాబడి..**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారికి ఆదివారం వివిధ శాఖల నుంచి భారీగా ఆదాయం వచ్చింది.

నిత్య రాబడిలో భాగంగా స్వామి,అమ్మవార్లకు రూ.51,80,379 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.3,57,950, బ్రేక్ దర్శనం ద్వారా రూ.4,21,500, శ్రీసత్యనారాయణ వ్రతాల ద్వారా రూ.2,79,000, రూ.150 వీఐపీ దర్శనం ద్వారా రూ.9,29,700, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.7,27,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.1,40,200, ప్రసాద విక్రయం ద్వారా రూ.16,83,760, కల్యాణకట్ట ద్వారా రూ.1,45,000తోపాటు వివిధ శాఖలు, పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

## బిజెపి పార్టీ కార్యవర్గ మండల సమావేశానికి హాజరైన నాయకులు

**జయభేరి, పరవాడ:**



పరవాడ మండలం గొర్లివానిపాలెం గ్రామంలో బీజేపీ మండల సమావేశం నిర్వహించారు. పరవాడ బిజెపి పార్టీ అధ్యక్షుడు పిల్లా సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖలకు సంబంధించిన కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. అదేవిధంగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు పట్టాభి ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో జరిగిన ఐదు రాష్ట్రాల్లోని ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో బిజెపి అధికారులకు రావడం ఆనందమన్నారు. దేశంలోని ప్రజల నమ్మకాన్ని బిజెపి పార్టీ ఎంతగా చూరగుందో ఈ ఎన్నికల ఫలితాలు తెలియజేస్తున్నాయని అన్నారు. భవిష్యత్తులో ఈ దేశంలో బిజెపి పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి బిజెపి కార్యకర్త శక్తి వంచన లేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ మధ్య కాలంలో బిజెపి పార్టీలో కొత్తగా చేరిన లంకెలపాలెంకు చెందిన మడక పార్వతి రమేష్‌ను మండల పార్టీ కార్యవర్గానికి పరిచయం చేశారు. అదే విధంగా కొంతమంది సీనియర్ నాయకులకు పార్టీలో జిల్లాలో మరియు రాష్ట్రస్థాయిలో పదవులు రావడంతో వారికి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ముత్యాల అప్పారావు, గండి నమోబాబు, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు దట్టి శ్రీనివాస్, జిల్లా కిషన్ మోర్చా ఉపాధ్యక్షుడు బండారు రాజశేఖర్, రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యుడు కూండ్రపు సోమనాయుడు, పరవాడ మండల ప్రధాన కార్యదర్శి బంతికోరు గోవిందరాజు, మండల ఉపాధ్యక్షుడు మోటూరు వీరు నాయుడు, యలమర్తి శ్రీనివాస్, పందూరి రమేష్, మండల ఓబిసి మోర్చా అధ్యక్షులు జుత్తక రాము, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు మాసవరపు నాగరాజు, మహిళా నాయకురాలు మడక పార్వతీ రమేష్, బిజెపి నాయకులు వెన్నెల నూకరాజు, వియ్యపు శ్రీనివాసు, దాలిబోయిన మణికంఠ కొమ్మోజు గోపి తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్ శ్రామికుల మేడలకు ఉరితాళ్లు

- సిఐటియు రాష్ట కౌన్సిల్ సభ్యుడు గనిశెట్టి

**జయభేరి, పరవాడ:**




కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక , శ్రామిక వర్గంపై యుద్ధాన్ని మొదలుపెట్టిందని, ఈ లేబర్ కోడ్స్ శ్రామికుల మెడలకు బిగించిన ఉరితాళ్లేనని గని శెట్టిగర్జించారు. ఎన్నికల వేళ మాయ మాటలతో ప్రజలను వంచించిన పాలకులు, గద్దెనెక్కిన వెంటనే కార్పొరేట్ శక్తుల పాదాల చెంత కార్మిక హక్కులను తాకట్టు పెట్టారని గని శెట్టితీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ముంబైలో పెట్రోలియం అండ్ గ్యాస్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మహాసభలో గని శెట్టి తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన లేబర్ కోడ్స్ ఫైనల్ రూల్స్ గెజిట్ ప్రతులను దహనం చేయాలన్నారు. ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు.కార్పొరేట్ కోడ్స్ - శ్రామిక వ్యతిరేక విధానం ఇవి లేబర్ కోడ్స్ కాదు కార్పొరేట్ యజమానుల కోసం రాసుకున్న బానిస సంకెళ్లు. దశాబ్దాల పాటు రక్తం చిందించి సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినం, కనీస వేతనం, సామాజిక భద్రత వంటి హక్కులను ఈ ప్రభుత్వం తుంగలో తొక్కింది. ఉత్పత్తి వర్గాల పై సాగుతున్న ఈ పాశవిక దాడిని సహించేది లేదు గ్రామీణ పేదలపై గొడ్డలిపెట్టు వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీస్తూ, గ్రామీణ పేదల జీవనాధారమైన ఉపాధి హామీ పథకాన్ని ఈ ప్రభుత్వం ఉరి తీస్తోందని గని శెట్టి మండిపడ్డారు. భూమి, కూలి, బతుకు దెరువు కోసం పోరాడుతున్న పేదల హక్కులను హరించే ఏ చట్టాన్నైనా తిప్పికొడతామని గని శెట్టి హెచ్చరించారు. శ్రామికుల శ్రమను దోచుకోవడమే లక్ష్యంగా పెట్టుకుందని, ఈ దోపిడీ పాలనను అంతం చేసే వరకు విశ్రమించేది లేదని గని శెట్టిస్పష్టం చేశారు.ఇప్పుడే తిరగబడకపోతే, రేపు మన బతుకులు బానిసత్వంలో మగ్గిపోతాయని, జెండాలు చేబూని వీధుల్లోకి రావాలని శ్రామిక లోకానికి గని శెట్టి పిలుపునిచ్చారు.

## భగాయత్ డిమార్ట్ వద్ద రోడ్డును బాగు చేయాలంటూ వినూత్న నిరసన



**జయభేరి, ఉప్పల్ :**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఉప్పల్ ప్రాంతం నందు రామంతాపూర్ లోని భగాయత్ డి మార్ట్ వద్ద రోడ్డు పాడైపోయి చాలా కాలం అవుతుంది. అధికారులకు విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలంటూ ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాడైపోయిన రోడ్డు వద్ద బైకుకు కట్టెలు కట్టుకొని బైకును మోసుకొస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ రోడ్డు నందు జిహెచ్ఎంసి అధికారులు ప్రజా ప్రతినిధులు వెళ్తూ వస్తూ ఉంటారు. ఈ సమస్య వారికి కనిపించడం లేదా? ప్రజల వద్ద నుండి పన్నులు వసూలు చేసే శ్రద్ధ సమస్య పరిష్కారం పైన అధికారులు చూపట్లేదు అని ఇప్పటికైనా అధికారులు గుర్తించి సమస్యను వెంటనే పరిష్కరించాలని లేనిచో కార్పొరేషన్ ఆఫీస్ ముట్టడిస్తామని వారు మాట్లాడినారు. ఈ కార్యక్రమంలో ప్రజావాణి ప్రతినిధులు అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ ఉపాధ్యక్షులు టి రవీంద్రావు, సిద్ధగోని రాజు గౌడ్, పొనుగోటి రమేష్, R కుమారస్వామి, s చంద్రశేఖర్, రాజు, కిరణ్ పాల్గొన్నారు.




## ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల భవన నిర్మాణ నిధికి విరాళం

**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సేవాసదనం దేవరకొండ మొదటి అంతస్తు భవన నిర్మాణ నిధికి రిటైర్డ్ ఉప కోశాధికారి అల్లె పాండు తన 63వ పుట్టినరోజు సందర్భంగా రూ. 5,116 సంఘ అధ్యక్షులు తాడిశెట్టి నరసింహ, కార్యదర్శి అంకం చంద్రమౌళిలకు అందజేసినారు. ఈ సందర్భంగా అల్లె పాండు మాట్లాడుతూ మా దేవరకొండ పెన్షనర్ సంఘం పెద్దల సేవలు వెలకట్టలేనివి, స్వంత పనులకంటే ఎక్కువ శ్రద్ధతో పెన్షనర్స్ మిత్రులకు పనులు చేసిపెడుతున్నారు అని అన్నారు. కార్యదర్శి అంకం చంద్రమౌళి, కార్యవర్గం సభ్యులు మునిని వీరయ్య మాట్లాడుతూ మా దేవరకొండ సంఘం సభ్యుల ఆర్థిక సహాయం వెలకట్టలేనిది అన్నారు. వారి సహకారంతోనే మొదటి అంతస్తు నిర్మిస్తున్నాము అన్నారు. అనంతరం హాజరైన మిత్రులకు సీతల పానీయం అందజేసినారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి పంగునూరు లింగయ్య, సభ్యులు అప్పం వీరయ్య, అలంపల్లి శ్రీనివాసులు, కోర్వి లక్ష్మయ్య, గోకికారు ప్రభాకర్, లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

## మైసమ్మకు ఆటో యూనియన్ పూజలు

- ఆనవాయితీగా వస్తున్న ఆచారం



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం లోని స్థానిక రైతు వేదిక వద్ద ఉన్న గ్రామ దేవత మైసమ్మకు ఆటో యూనియన్ సభ్యులు ఆదివారం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మరికల్ రూట్ లైన్ ఆటో యూనియన్ డ్రైవర్స్ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ జిల్లా ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి కే. రాము, దేవరకద్ర మండల ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి కోట్ల రామకృష్ణ, ఉపాధ్యక్షుడు కౌన్సిలర్, జోగి గోవిందు, ఆటో యూనియన్ సలహాదారులు సత్తి, ఆంజనేయులు, శివరాజు, శేఖర్, గాంధీ, బద్రి,భీమాచారి, ఎల్లప్ప శెట్టి తదితర ఆటో డ్రైవర్స్ పాల్గొన్నారు.

## పాఠశాలల కోసం రూ. 37 కోట్ల నిధులు

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి


**జయభేరి, ఉప్పల్ :**

మెడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఉప్పల్‌లోని జెడ్‌పిహెచ్‌ఎస్, కుషాయిగూడ, కాప్రా ప్రాంతాల్లోని జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలల అప్‌గ్రేడేషన్ కోసం 37 కోట్ల రూపాయల నిధులు కేటాయించబడినాయి. ఈ నిధులతో పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, అవసరమైన మౌలిక వసతులు, ఉన్నత తరగతుల (PP, VI, VII, XI, XII) ఏర్పాటు చేయబడనున్నాయి. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ఈ చర్యలు ఎంతో ఉపయోగపడనున్నాయి. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యా రంగ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# కిడ్నీ వైఫల్య సమస్యకు యశోద ఆసుపత్రిలో విజయవంతమైన చికిత్స

- అత్యంత తీవ్రతరం వ్యాధులను పరిష్కరిస్తున్న యశోద మలక్పేట్ హాస్పిటల్ వైద్య బృందం

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండకు చెందిన 32 ఏళ్ల చిన్న చక్కని పద్మకు ఆక్యుట్ కిడ్నీ ఇంజరీతో కూడిన రాపిడ్లీ ప్రోగ్రెసివ్ రీనల్ ఫెయిల్యూర్‌ను సమయానికి గుర్తించి ప్రారంభ దశలోనే ప్రత్యేక నెఫ్రాలజీ చికిత్స అందించి డయాలసిస్ నుండి విముక్తి కలిగించామని హైదరాబాద్ మలక్పేట్ యశోద హాస్పిటల్ వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం దేవరకొండ పట్టణం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ పద్మ జ్వరం, వణుకులు, అనంతరం శరీరమంతా వాపులతో బాధపడుతూ యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మలక్‌పేట్‌లో చేరిన వెంటనే డా. చెతన్ వీరమనేని, కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ & రీనల్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ ఆధ్వర్యంలో రోగికి సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించారని,కిడ్నీల పనితీరు తీవ్రంగా దెబ్బతిన్నట్లు నిర్ధారణ కావడంతో వ్యాధి మూలకారణాన్ని గుర్తించేందుకు అల్ట్రాసౌండ్ మార్గదర్శకత్వంలో రియల్‌టైమ్ రీనల్ బయాప్సీ నిర్వహించారని తెలిపారు. చికిత్స అనంతరం రోగి ఆరోగ్యం మెరుగుపడిందని, బయాప్సీ ప్రక్రియ ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తైందని,శరీర వాపులు తగ్గి రోగి పరిస్థితి స్థిరపడిందని,అవసరమైన మందులు, ఆహార నియమాలు, ఫాలోఅప్ సూచనలతో డిశ్చార్జ్ చేశారని అన్నారు.

ఆక్యుట్ కిడ్నీ ఇంజరీతో కూడిన రాపిడ్లీ ప్రోగ్రెసివ్ రీనల్ ఫెయిల్యూర్‌ను సమయానికి గుర్తించి ప్రారంభ దశలోనే ప్రత్యేక నెఫ్రాలజీ చికిత్స అందించడం ఎంతో ముఖ్యమని లేకపోతే కిడ్నీలు శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం ఉంటుందని తెలిపారు.

డయాలసిస్ ప్రారంభించిన రోగుల్లో సుమారు 50-60 శాతం మందికి, సమస్యను ప్రారంభంలోనే గుర్తించి సరైన చికిత్స అందిస్తే దీర్ఘకాలిక డయాలసిస్ అవసరం లేకుండా కోలుకునే అవకాశం ఉంటుందని సూచించారు.ముఖ్యంగా యువ రోగుల్లో కిడ్నీ సమస్యను ముందుగానే గుర్తించి సరైన వైద్య నిర్వహణ అందిస్తే, డయాలసిస్ ప్రారంభించినప్పటికీ లేదా క్రియాటినిన్ స్థాయిలు అధికంగా ఉన్నప్పటికీ తిరిగి కోలుకునే అవకాశాలు చాలా ఉంటాయని తెలిపారు.చికిత్స ద్వారా పూర్తిగా నయం అయ్యే కిడ్నీ వ్యాధులపై అవగాహన అవసరమని, సమస్యను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన వైద్య చికిత్స అందిస్తే చాలామంది రోగులు పూర్తిగా కోలుకుని డయాలసిస్ అవసరం లేకుండా సాధారణ జీవితానికి తిరిగి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కేసు మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న అత్యాధునిక నెఫ్రాలజీ సేవలు, సమగ్ర వైద్య సదుపాయాలు, ఖచ్చితమైన నిర్ధారణ సామర్థ్యాన్ని మరోసారి ప్రతిబింబించింది. ఆక్యుట్ కిడ్నీ ఇంజరీతో పాటు రాపిడ్లీ ప్రోగ్రెసివ్ రీనల్ ఫెయిల్యూర్ వంటి క్లిష్ట పరిస్థితులను ప్రారంభ దశలోనే గుర్తించి, సమయానికి అధునాతన పరీక్షలు నిర్వహించి చికిత్స అందించడం ద్వారా రోగిని స్థిరపరచడంలో ఆసుపత్రి వైద్య బృందం విజయవంతమైందని,ప్రత్యేక నెఫ్రాలజీ పర్యవేక్షణ, రీనల్ బయాప్సీ వంటి ఆధునిక నిర్ధారణ విధానాలు, అనుభవజ్ఞులైన వైద్యుల సమన్వయం ఈ విజయానికి కీలకంగా నిలిచాయని అన్నారు.

అత్యాధునిక సాంకేతికత, ఆధునిక నెఫ్రాలజీ విభాగం, నిపుణులైన వైద్య బృందం, రోగికేంద్రిత వైద్య విధానాలతో క్లిష్టమైన కిడ్నీ వ్యాధులను కూడా సమర్థవంతంగా చికిత్స చేయగల సామర్థ్యం తమ ఆసుపత్రికి ఉందని యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మలక్‌పేట్ డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె.శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలియజేసినారు.




## దేవరకద్ర ఎమ్మెల్యే పర్యటన

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం లోని ఆయా మండలాలలో సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ముందుగా ఉదయం 10 :30 గంటలకు భూత్పూర్ మున్సిపాలిటీ కేంద్రంలోని జూనియర్ కళాశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రారంభోత్సవాలలో ఎమ్మెల్యే పాల్గొంటారు. అలాగే 11:30 గంటలకు మూసాపేట్ మండలం సంకల్ మద్ది గ్రామ సమీపంలోనున్న కేజీబీవీ పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు వనపర్తి జిల్లా కలెక్టరేట్ లో వరి కొనుగోలుకు సంబంధించి మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన నిర్వహిస్తున్న సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొంటారు.కావున ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.

## వివాహ వేడుకల్లో హైకోర్టు న్యాయవాది



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర నియోజకవర్గం లో ఆదివారం జరిగిన పలు వివాహ కార్యక్రమాలలో హైకోర్టు న్యాయవాది, దేవరకద్ర నియనియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు.

## మేడిపల్లి పక్కనే ఉన్న గుడిలో చోరీ..!

- సీసీ కెమెరాల్లో చోరీ దృశ్యాలు నమోదు..!
- మేడిపల్లి పోలీసుల గస్తీ వైఫల్యానికి నిదర్శనంగా మరో ఘటన వెలుగు చూసింది..!

**జయభేరి, మేడిపల్లి :**

మేడిపల్లి పోలీస్ స్టేషన్ కు ఆనుకొని ఉన్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గుడిలో అర్ధరాత్రి ఓ దొంగ చొరబడి హుండీ పగులగొట్టి నగదు అపహరించాడు. పీఎస్ పక్కనే చోరీ జరుగుతున్నా పోలీసులు స్పందించకపోవడం ఏంటని స్థానికులు మండిపడుతున్నారు..! పోలీసుల పహారా ఎక్కడనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఘటనపై ఆలయ కమిటీ మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది...! సీసీ కెమెరాల్లో చోరీ దృశ్యాలు నమోదు..!

# మన్యంకొండలో వైభవంగా తిరుచ్చి సేవ సాంప్రదాయ రీతిలో పూజలు

- అలంకరణలో భక్తకోటికి దర్శనం ఇచ్చిన స్వామివారు

**జయభేరి, దేవరకద్ర :**




మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామి వారి తిరుచ్చి సేవ పవిత్ర పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చి సేవ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన తిరుచ్చి వాహనంపై స్వామివారిని దేవస్థానం పురవీధుల గుండా ఊరేగించారు.

పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వైద్యాలు, కాగడాల వెలుతురు, భక్తుల హరినా మశ్చరణల మధ్య స్వామి వారి సేవ ముందుకు కదిలింది. ఈ సందర్భంగా దేవాలయంలోని రథ ఆధ్వర్యంలో అళహరి రామకృష్ణ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని తిరిగి మళ్ళీ తిరుచ్చి వాహనంపై గర్భగుడిలోకి ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు తిరుచ్చి వాహనంపై అలంకరణలో ఊరేగుతూ భక్తకోటికి దర్శనం ఇచ్చారు. ఈ దృశ్యాన్ని చూసి భక్తులు తన్మయం చెందారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ ,ఈఓ శ్రీనివాస రాజు, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య పర్యవేక్షకుడు నిత్యానంద చారి, దేవస్థానం పురహితులు, సిబ్బంది, వివిధ ప్రాంతాలనుండి తరలివచ్చిన భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చౌదర్ పల్లిలో చిరుత సంచారం

- ఆందోళనలో గ్రామస్తులు
- అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చిన గ్రామస్తులు

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర మండలం చౌదర్ పల్లి సమీపంలోని బయ్యన్న గుట్టపై ఆదివారం సాయంత్రం చిరుత పులి గ్రామస్తులకు కనిపించింది. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. చౌదర్ పల్లి సమీపంలోని బయ్యన్న గుట్టపై ఉన్న గుడి వద్ద చిరుత సంచరిస్తున్న దృశ్యాన్ని గ్రామస్తులు గమనించారు. దీంతో ఈ విషయాన్ని వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. చిరుత కనిపించిన దృశ్యాన్ని గ్రామస్తులు ఫోటోలు తీయడంతో పాటు తమ సెల్ ఫోన్లలో వీడియోలు కూడా తీశారు.ఇదే తరహాలో గతంలో చౌదర్ పల్లి పరిసర ప్రాంతాల్లోనున్న గుట్టలపై చిరుత పులి గ్రామస్తులకు కల్పించింది. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు కనిపించింది. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో ఉన్న గుట్టలపై సంచరిస్తున్న చిరుతపులని ఫారెస్ట్ అధికారులు స్పందించి తీసుకెళ్లాలని ముక్తకంఠంతో కోరుతున్నారు. చౌదర్ పల్లి సమీపంలోని గుట్టలపై చిరుత కనిపించడం ఈ ప్రాంతంలో పెద్ద చర్చనీయాంశమైంది.

## రానున్న రోజుల్లో భారతీయ జనతా పార్టీ మరింత బలోపేతం

**జయభేరి, హయత్‌నగర్ :**



పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మహా బహిరంగ సభలో మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు, యువత, పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొనడం జరిగింది. ఈ మహాసభకు ప్రజలు విశేష సంఖ్యలో తరలి రావడం భారతీయ జనతా పార్టీపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని, దేశాభివృద్ధి పట్ల ఉన్న మద్దతును స్పష్టంగా చాటింది. సభా ప్రాంగణం మొత్తం దేశభక్తి నినాదాలతో మారుమోగి, కార్యకర్తల ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ... దేశ అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం, యువత భవిష్యత్తు, తెలంగాణ రాష్ట్ర పురోగతికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వం ఎంతో అవసరమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. సభలో భారీ సంఖ్యలో పాల్గొన్న ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులు, మహిళలు, యువత, అభిమానులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, ఈ సభ విజయవంతం కావడం పార్టీ బలాన్ని మరింత బలపరిచిందన్నారు. రానున్న రోజుల్లో భారతీయ జనతా పార్టీ మరింత బలోపేతం కావడానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశం కోసం... అభివృద్ధి కోసం... బలమైన నాయకత్వం కోసం... ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని కోరారు.



## యాదగిరి కొండపైన శివాలయంలో ఆర్జిత సేవలు ప్రారంభం

- ప్రతి అష్టమి నాడు అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన

**జయభేరి, యాదగిరిగుట్ట, మే10:**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ఆర్జిత సేవలను ప్రారంభించారు. ఆదివారం అష్టమి పురస్కరించుకొని శ్రీపర్వత వర్ధినీ అమ్మవారికి అభిషేకం ,కుంకుమార్చనను ప్రారంభించినట్లు యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ తెలిపారు. ప్రతి అష్టమి రోజు ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు అభిషేకం, కుంకుమార్చన జరుగుతుందని, టికెట్ ధర రూ.500గా నిర్ణయించినట్లు తెలిపారు. ఒక టికెట్‌పై దంపతులకు ప్రవేశం కల్పిస్తున్నట్లు, భక్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ కోరారు.


## నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్ హరిబాబు



**జయభేరి, యాదగిరిగుట్ట, మే 10:**

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి దర్శనార్థం హైదరాబాద్‌కు చెందిన సత్యశ్రీ అనే భక్తురాలు యాదగిరిగుట్టకు వచ్చారు. ఆదివారం హరిబాబుకు చెందిన ఆటోలో భక్తురాలు కొండపైకి వెళ్తుండగా సుమారు మూడు తులాల బంగారు పుస్తెల తాడు ఆటోలో జారిపడిపోయింది. దానిని గమనించిన ఆటో డ్రైవర్ హరిబాబు దురాశ పడకుండా వెంటనే ఎస్పీఎఫ్ కంట్రోల్ రూమ్‌ను ఆశ్రయించారు. ఆలయ అధికారుల ద్వారా పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌లో అనౌన్స్‌మెంట్ చేయించి బాధితురాలిని గుర్తించారు. అనంతరం యాదగిరిగుట్ట ఆలయ ఈఓ భవానీ శంకర్, ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు సమక్షంలో ఆ బంగారు గొలుసును బాధితురాలికి అందజేశారు. ఆటో డైవర్స్ హరిబాబు నిజాయితీని ఆలయ ఈఓ భవానీ శంకర్, అధికారులు, భక్తులు ప్రత్యేకంగా అభినందించారు.

## హనుమాన్ జయంతి వేడుకలకి ఏర్పాట్లు పూర్తి



**జయభేరి, పరవాడ:**

పరవాడలో పైడిమాంబ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా ఉదయం 6 గంటల నుండి పరవాడ సినిమా హాల్ జంక్షన్ పంచముఖ ఆంజనేయ స్వామి గుడి వద్ద స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు,అభిషేకములు,హోమాలు కార్యక్రమంలు జరుగునని కమిటీ సభ్యులు తెలియజేసారు. ఈ సందర్భంగా భక్తులు ప్రజలు యావన్మంది విచ్చేసి స్వామివారి తీర్థప్రసాదాలు తీసుకొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. అదేవిధంగా అదే రోజు మధ్యాహ్నం 12 గంటల నుండి సినిమా హాల్ జంక్షన్ పంచముఖ ఆంజనేయ స్వామి గుడి వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించి అదే రోజు సాయంత్రం 4 గంటల నుండి పంచముఖ ఆంజనేయ స్వామి గుడి దగ్గర నుండి శోభాయాత్ర భారీ బైక్ ర్యాలీ కార్యక్రమం కూడా జరుగునని తెలిపారు. సాయంత్రం 7 గంటలకు సినిమా హాల్ జంక్షన్ పురవీధుల్లో పల్లకి ఊరేగింపు జరుగునని తెలిపారు.

## మహిళలకు సైబర్ నేరాలుపై పోలీస్ శాఖ అవగాహన కార్యక్రమం



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం రావాడ పంచాయతీలో పరవాడ సీఐ ఆర్. మల్లికార్జున రావు ఆధ్వర్యంలో మహిళల అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు మహిళల భద్రత, శక్తి యాప్, పోక్సో చట్టం, 112 ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్, గృహ హింస, సైబర్ నేరాలు మరియు గంజా సంబంధిత అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు ఎలాంటి వేధింపులు, అనుమానాస్పద కార్యకలాపాలు లేదా మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సైబర్ మోసాలు, సోషల్ మీడియా దుర్వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలని, పిల్లలపై ప్రతిరోజూ పర్యవేక్షణ ఉంచి చెడు అలవాట్లు, మత్తు పదార్థాలు మరియు ఇతర వ్యసనాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు, స్థానిక నాయకులు వియ్యపు చిన్నా, గ్రామ మహిళలు ఇతర పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# హాట్ టాపిక్‌గా కృతిసనన్ కామెంట్స్

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అక్కర్లేని భామ కృతిసనన్. తెలుగులో చేసింది తక్కువ సినిమాలే అయినా టాలీవుడ్‌లో ఈ భామకున్న ఫ్యాన్ బేస్ ఎక్కువే అని చెప్పాలి. చాలా కాలంగా హిందీ సినిమాలకే పరిమితమైన ఈ ముద్దుగుమ్మ కాస్ట్ కటింగ్ కారణంగా హీరోయిన్లు ఎలా ప్రభావితం అవుతున్నారో చెప్పుకొచ్చింది కృతిసనన్. బడ్జెట్ నియంత్రణలో భాగంగా నిర్మాతలు మొదట హీరోయిన్ల పారితోషికం తగ్గించడంపైనే ఫోకస్ పెడుతున్నారని తాజాగా ఓ చర్చ నెట్టింట కొనసాగుతుంది. ఈ విషయమై కృతిసనన్ మాట్లాడుతూ.. మధ్య శ్రేణి (మిడ్ రేంజ్ హీరోయిన్లు) రెమ్యునరేషన్లను నిర్మాతలు పున: పరిశీలిస్తున్నారంది. అయితే ఇండస్ట్రీలో స్టార్ హీరోలకు ఇచ్చే భారీ రెమ్యునరేషన్లపై ఇప్పటికీ అతి తక్కువ స్థాయిలో చర్చ నడుస్తుందని చెప్పింది. కాస్ట్ కటింగ్ ఎఫెక్ట్ ప్రధానంగా హీరోయిన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులపైనే పడుతుందని అభిప్రాయపడ్డింది. అదే సమయంలో కేవలం టాప్ హీరోల రెమ్యునరేషన్లు తగ్గించుకుంటేనే మార్పు మొదలవుతుందని ఓ వర్గానికి చెందిన దర్శకనిర్మాతలు నమ్ముతున్నారని చెప్పుకొచ్చింది. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇదిలా ఉంటే బ్యాక్ టు బ్యాక్ బాక్సాఫీస్ ఫెయిల్యూర్స్ కారణంగా, థియాట్రికల్ రెవెన్యూ పడిపోవడం కారణంగా నిర్మాతలు ప్రొడక్షన్ ఖర్చులను తగ్గించుకోవాలని చూస్తున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్.




## ప్రభాస్ స్పిరిట్ కొత్త షెడ్యూల్ షురూ కానుందా..?


గ్లోబల్ స్టార్ యాక్టర్ ప్రభాస్ అభిమానులను ఎంటర్‌టైన్ చేసేందుకు బ్యాక్ టు బ్యాక్ సినిమాలను ట్రాక్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ స్పిరిట్. యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా డైరెక్ట్ చేస్తున్నాడు. షూటింగ్ దశలో ఉన్న ఈ మూవీకి సంబంధించి ఏదో ఒక వార్త నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది. తాజా రిపోర్ట్స్ ప్రకారం స్పిరిట్ కొత్త షెడ్యూల్ రేపు షురూ కానుందట. ప్రభాస్, వివేక్ ఒబెరాయ్ మధ్య వచ్చే హై ఆక్టేన్ ఫైట్ సీక్వెన్స్‌ను ఈ షెడ్యూల్‌లో షూట్ చేయనున్నారని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు సుమారు 2 నెలలపాటు సుదీర్ఘంగా ఈ షెడ్యూల్ కొనసాగనుందట. ఇందులో ప్రభాస్ తొలిసారి పోలీసాఫీసర్‌గా నటిస్తుండటంతో అభిమానుల్లో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. హై ఓల్టేజీ కాప్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న ఈ మూవీలో యానిమల్ ఫేం తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తోంది. సందీప్ రెడ్డి వంగా హోం బ్యానర్ భద్రకాళి పిక్చర్స్, టీ సిరీస్‌తో కలిసి సంయుక్తంగా తెరకక్కిస్తున్న ఈ చిత్రానికి హర్షవర్ధన్ రాణే సంగీతం అందిస్తున్నాడు. స్పిరిట్‌లో బాలీవుడ్ యాక్టర్ వివేక్ ఒబెరాయ్ విలన్‌గా నటిస్తున్నాడు. ఇక పాపులర్ సౌత్ కొరియన్ యాక్టర్ (డాన్ లీ) మడాంగ్‌సియోక్ (MaDongSeok) విలన్‌గా నటిస్తున్నాడని వార్తలు రాగా.. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వస్తే క్లారిటీ వచ్చే అవకాశముంది.

## రా ఏజెంట్‌గా వెంకీ?



వెంకటేశ్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న క్రైమ్ కామెడీ ఫ్యామిలీ డ్రామా 'ఆదర్శకుటుంబం - హౌస్ నెం.47'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఈ సినిమాలో ఓ క్రేజీ ఫ్యాష్‌బ్యాక్‌ని త్రివిక్రమ్ డిజైన్ చేశారట. ఈ ఘట్టం ఆద్యంతం నవ్వులు పూయిస్తుందని ఇన్‌సైడ్ టాక్. ఈ ఎపిసోడ్‌లో వెంకటేశ్ దృష్టిలోపం ఉన్న 'రా ఏజెంట్'గా కనిపిస్తారట. తన కున్న లోపంతో వెంకీ పాత్ర చేసే ఛేజ్‌లు ఫుల్ ఎంటర్‌టైనింగ్‌గా ఉంటాయని తెలుస్తున్నది. 'మీర్జాపుర్'ఫేం దివ్యేందుశర్మ ఇందులో తీవ్రవాదిగా నటిస్తున్నారు. శ్రీనిధిశెట్టి కథానాయిక. నికితిన్ ధీర్, రావురమేష్ ఇతర పాత్రధారులు. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై సూర్యదేవర రాధాకృష్ణ(చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దసరా కానుకగా సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# నాగబంధం
# హుక్ స్టెప్ చాలెంజ్‌కు రెడీనా..?



చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తోంది ఇస్మార్ట్ భామ నభా నటేశ్. ఈ భామ వన్ ఆఫ్ ది ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం నాగబంధం. లీడింగ్ ప్రొడ్యూసర్ కమ్ డైరెక్టర్ అభిషేక్ నామా డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో పెదకాపు ఫేం విరాట్ కర్ణ హీరోగా నటిస్తుండగా.. ఐశ్వర్య మీనన్ సెకండ్ ఫీమేల్ లీడ్ రోల్ చేస్తోంది. అడ్వెంచరస్ మైథలాజికల్ డ్రామా నేపథ్యంలో వస్తున్న ఈ మూవీ టీజర్‌కు మంచి స్పందన వస్తోంది.

నాగబంధం నుంచి సురసుర హెక్ స్టెప్ చాలెంజ్‌లో జాయిన్ అవండి.. ఎక్జయిటింగ్ గిఫ్ట్‌లు అందుకోండి అంటూ మేకర్స్ నభానటేశ్ డ్యాన్సింగ్ వైబ్ వీడియోను షేర్ చేశారు. నాగబంధం సినిమాలోని సుర సుర సాంగ్‌కు అదిరిపోయే స్టెప్పులేసింది నభా నటేశ్. సంప్రదాయ లంగావోణీలో హొయలుపోతూ నభానటేశ్ చేసిన డ్యాన్స్ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.

ఈ చిత్రాన్ని అభిషేక్ పిక్చర్స్, నిక్ స్టూడియోస్, తారక్ సినిమాస్ బ్యానర్లపై అభిషేక్ నామా, కిశోర్ అన్నపురెడ్డి, లక్ష్మి ఐరా సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్‌లో వస్తోన్న నాగబంధం చిత్రాన్ని తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల చేయనున్నారు.

టాలీవుడ్ నుంచి పాన్ ఇండియా స్థాయిలో సినిమాలు తెరకెక్కించి డెవిల్ తర్వాత అభిషేక్ నామా నుంచి వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. పద్మనాభస్వామి, పూరీ జగన్నాథ్ ఆలయాల్లో గుప్త నిధుల ఆవిష్కరణల స్ఫూర్తిగా వస్తోన్న ఈ చిత్రంలో వచ్చే క్లైమాక్స్ ఇదివరకెన్నడూ చూడని విధంగా ఉండబోతుందట. గుప్తనిధులు, వాటికి రక్షణగా ఉన్నట్టుగా అగ్రెసివ్ లుక్‌లో ఉన్న కోబ్రా పోస్టర్ ఇప్పటికే సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది.

## ఫామ్ హౌస్‌కి వస్తే 25 లక్షలు ఇస్తా అన్నాడు..



బేబీ సినిమాతో బాగా పాపులర్ అయ్యింది కిర్రాక్ సీత అలియాస్ సుప్రజ. ఈ సినిమాలో హీరోయిన్ ఫ్రెండ్‌గా నెగిటివ్ రోల్‌లో అద్భుతంగా నటించింది సీత. అయితే ఇదే బేబీ సినిమానే ఆమె నెగెటివ్‌గా కూడా మారింది. ఈ సినిమాలో హీరోయిన్‌ని చెడగొట్టే క్యారెక్టర్‌లో నటించిన కిర్రాక్ సీతతో కొందరు దారుణంగా ప్రవర్తించారు. ఏకంగా రేప్ చేస్తామని, చంపేస్తామని బెదిరించారు. సినిమాల్లోకి రాకముందు యూట్యూబర్ గా బాగా ఫేమస్ అయ్యింది సీత. ముఖ్యంగా 7 ఆర్ట్స్ సరయూతో కలిసి చాలా వీడియోలు చేసింది. '7 ఆర్ట్స్‌లో షూట్ చేస్తున్నప్పుడు ఎవరో ఒక వ్యక్తి నాకు కాల్ చేశాడు. ఫోన్ లిఫ్ట్ చేసి మాట్లాడితే.. ఒక సినిమాలో ఆఫర్ ఉందన్నాడు. ఎవరికైనా సినిమాలో ఆఫర్ వచ్చిందంటే హ్యాపీగానే ఫీల్ అవుతాం కదా. నేను కూడా సంతోష పడ్డాను. అప్పుడు నేను చిన్నపిల్లని 21 ఏళ్లు ఉంటాయి. సినిమా చేస్తానని నేను ఓకే చెప్పాను. అయితే నన్ను ఫాం హౌస్‌కి రావాలని చెప్పారు. ఫాంహౌస్‌కి ఎందుకండి.. ఆఫీస్ ఉంటుంది కదా అని అడిగితే.. మొత్తం టీమ్‌ని పిలుస్తున్నారని చెప్పడంతో సరేనని అన్నాను. కానీ ఫాం హౌస్‌కి వెళ్లలేదు.. సాయంత్రం దాకా కాల్స్ లిఫ్ట్ చేయలేదు. వాళ్లు కూడా నన్ను ప్రెజర్ చేయలేదు. అయితే రెండు మూడు రోజుల తర్వాత వాళ్లు కాల్ చేసి ఎందుకు రాలేదని అడిగారు. నాకు కరెక్ట్ కాదని అనిపించిందని చెప్పడంతో మీకు 25 లక్షలు ఇస్తారట అని చెప్పడంతో నేను వెంటనే నో చెప్పేశాను. మాకు తరచుగా ఇలాంటి కాల్స్ వస్తూనే ఉంటాయి.. నార్మల్‌గా మెసేజ్‌లు కూడా పెడుతుంటారు. మీ నెంబర్ ఎవరికైనా దొరికితే.. మేము ఒక సిరీస్ తీస్తున్నామని చెబుతారు. మీరు ఓకే నంటే సినిమా ఇండస్ట్రీలో పరిస్థితులు తెలుసు కదా అని అంటారు. ఎలా ఉంటదని అడిగితే .. వాళ్లు ఏదో ఒకటి చెబుతుంటారు. నేను నీకు సిగ్గుందా అని అంటాను. కొంతమంది సరదాగా చేస్తారు.. వాళ్లు ఇండస్ట్రీకి చెందిన వాళ్లు కాదు. వాళ్లకు నేనెవరో తెలియదు.. కానీ ఆమె అలాంటిది, ఇలాంటి ఒకసారి టెస్ట్ చేద్దామని కాల్స్ చేస్తుంటారు' అని కిర్రాక్ సీత చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ బిగ్ బాస్ బ్యూటీ కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**